ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 7 ఏప్రిల్ 2025


శేషవాహనంపై దర్శనమిచ్చిన కోదండరాముడు


ధ్వజారోహణ కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు


ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

జగదభిరాముడు.. శ్రీరాముడే

- వైభవంగా కోదండరాముడి ధ్వజారోహణ కార్యక్రమం
- భక్తులతో కిటకిటలాడిన రాములోరి కోవెల
- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): "జగదభిరాముడు శ్రీరాముడే... రఘుకుల సోముడు ఆ రాముడే" ఒంటిమిట్ట కోదండరాముడి వార్షిక బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం శ్రీరామనవమి వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. వేకువజామునే మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల మధ్య వృషభలగ్నంలో పంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా కంకణబట్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో గరుడ పటాన్ని ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ గరుడ ధ్వజ పటాన్ని ఆలయంలో ఊరేగింపుగా తీసుకువచ్చి గరుడ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ చేశామన్నారు. ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం చేసి, రాగతాల నివేదన ద్వారా ఇంద్రాద్రి సకల దేవతలను, నవగ్రహాలను అష్టదిగ్బంధాలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయభాస్కర్‌రెడ్డి కూడా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, టీటీడీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఎస్పీ అశోక్ కుమార్


స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

శేషవాహనంపై దర్శనమిచ్చిన దశరథరాముడు

ఒంటిమిట్ట కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీరామచంద్రుడు శేషవాహనంపై దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు ఆదివారం రాత్రి గ్రామ పురవీధుల్లో రామయ్య ఊరేగారు. ఈ సందర్భంగా దారి పొడవునా మహిళల కోలాటాలు, భజనలు నిర్వహించారు. కేరళ వాయిద్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. దారిపొడవునా భక్తులు స్వామివారికి కాయకర్పూరం సమర్పించి భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

తలంబ్రాల తయారీలో శ్రీవారి సేవకులు

ఈ నెల 11న జరిగే ఒంటిమిట్ట సీతారాముల కల్యాణోత్సవానికి తలంబ్రాల తయారీని టీటీడీ అధికారులు ఆదివారం ప్రారంభించారు. ముందుగా బియ్యం, ముత్యాలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తయారు చేసిన వాటితో పాటు ముత్యం, కంకణం ఉంచి ప్యాకెట్లను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 425 మంది శ్రీవారి సేవకులు పాల్గొన్నారు. సుమారు లక్షకు పైగా తలంబ్రాల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.


తలంబ్రాలు ప్యాకింగ్ చేస్తున్న శ్రీవారి సేవకులు

కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు


ముత్యాల తలంబ్రాలతో వస్తున్న దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కోనేటి కాలువ వీధిలోని రామాలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ప్రొద్దుటూరులోని రామాలయాల్లో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళల కోలాటం, కళాకారుల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

చర్లపల్లి-తిరుపతి మధ్య వీక్లీ స్పెషల్ రైలు

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి-తిరుపతి మధ్య కడప మీదుగా వీక్లీ సమ్మర్ స్పెషల్ రైలును మే ఆఖరు వరకు నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. వారంలో రెండురోజులు ఉంటుందన్నారు. శుక్ర, ఆదివారాల్లో రాత్రి 9.35కు చర్లపల్లిలో రైలు బయల్దేరి కాచిగూడకు రాత్రి 10.35కు గంటలకు చేరుకుంటుంది. జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల్, గుత్తి, తాడిపత్రి మీదుగా ఎర్రగుంట్లకు మరుసటి రోజు ఉదయం 6.30కి, కడపకు7.05కు, రాజంపేటకు 8గంటలకు చేరుకుని అక్కడ నుంచి తిరుపతికి 10గంటలకు చేరుకోనుందన్నారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో శని, సోమవారాల్లో 4.40కి తిరుపతిలో బయల్దేరి రాజంపేటకు సాయంత్రం 6ంటలకు, ఒంటిమిట్టకు రాత్రి 7.03కు, కడపకు రాత్రి 7.18కి, ఎర్రగుంట్ల 7.48 గంటలకు చేరుకుంటుంది. తాడిపత్రి, కర్నూలు, గద్వాల్, మహబూబ్‌నగర్, జడ్చర్ల మీదుగా సికింద్రాబాదుకు మరుసటి రోజు ఉదయం 5.30గంటలకు చర్లపల్లికి ఉదయం 7.10కి చేరనున్నట్లు తెలిపారు.

గంజాయి 'పుష్ప'లు

- ముందు కూలీలు.. ఆ తర్వాత స్మగ్లింగ్ లీడర్లు
- రెండు రోజుల కిందట నగరంలో అరెస్టు


7

మార్ఫింగ్ ఫొటోలతో యువతికి బ్లాక్‌మెయిల్

- పోలీసుల అదుపులో డాక్టర్



7

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని బీజేపీ కార్యాలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యాలయంలో బీజేపీ ఆవిర్భావ నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యాలయం ఎదురుగా బీజేపీ జెండా ఆవిరించి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉచిత బియ్యం ఇచ్చేది ప్రధానమంత్రి మోదీనే అన్నారు. పార్టీలో గ్రూపు రాజకీయాలు వద్దన్నారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, బీజేపీ కూటమి ఏర్పడిన తర్వాత వైసీపీకి దిక్కుతోచడం లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి విశ్వరూపం ఇప్పుడు ప్రజలకు తెలిసిందన్నారు. 32 కేసులూ విచారణ ప్రారంభం అయ్యాయన్నారు. పోలవరం పూర్తయితే జమ్మలమడుగు ప్రాంత ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. నియోజకవర్గంలో బైపాస్ రోడ్లతోపాటు అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో మంచినీటి సమస్యలు గత ప్రభుత్వంలో పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం కూటమిలో ఉన్న నాయకులు కమిటీగా ఏర్పడి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొండయ్య, గురుశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, వంగల నాగేంద్రయాదవ్, మూలింటి గురప్ప తదితరులు పాల్గొన్నారు.

కేడరులో నిర్వేదం..!



- టీడీపీ జెండా మోసిన వారు వెనక్కి
- ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన వారికే ప్రాధాన్యత
- వైసీపీ విమర్శలను దీటుగా ఎదుర్కోలేని వైనం
- అన్నిటికీ దూరంగా హార్డ్‌కోర్ అభిమానులు
- నేడు జిల్లాకు రానున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రులు
- తమను పట్టించుకోవాలంటున్న కార్యకర్తలు

మాజీ సీఎం జగన్ సొంత జిల్లాలో వైసీపీ ఆగడాలను భరించలేక జనం కూటమికి పట్టంగట్టారు. ఐదేళ్ల పాటు వైసీపీ అరాచకాలను ఎదుర్కొని టీడీపీ శ్రేణులు ముందుండి పోరాడారు. అధికారం వచ్చిందని సంబరపడ్డారు. ఈ సంబరం మూన్నాళ్ల ముచ్చటే అయింది. టీడీపీలోకి వచ్చిన వారిదే ఇప్పుడు పెత్తనం. పాత టీడీపీ.. వలస వచ్చిన వారి మధ్య విభజన బాగా కనిపిస్తోంది. వచ్చే నెలలో కడపలో జరగనున్న మహానాడు వేదిక పరిశీలన కోసం సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి, ఎం.రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత కడపకు రానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పార్టీ పరిస్థితిపై ఒకసారి అగ్రనాయకత్వం గమనించాలని క్యాడర్ కోరుతోంది.

(కడప-ఆంధ్రజ్యోతి): అధికారం వచ్చిందనే భావన కొన్నాళ్లకే టీడీపీ శ్రేణుల్లో నీరుగారిపోయింది. ఆది నుంచి పార్టీ కోసం కష్టపడితే.. కొత్తగా వచ్చినవారి పెత్తనం ఇప్పుడు ఎక్కువైంది. కడపలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల ముందు వరకు యాక్టివ్‌గా ఉన్న టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, మాజీ ఇన్‌చార్జి అమీర్‌బాబు, అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి ఇతర టీడీపీ నేతలంతా ఇప్పుడు సైలెంట్ అయ్యారు. హరిప్రసాద్, గోవర్ధనరెడ్డిలు కూడా అంటీ ముట్టనట్లుగా ఉన్నారు. ఇక్కడ రెండు వర్గాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక్కడ కొన్ని డివిజన్లలో కూడా బయటి నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యత ఉందని వాపోతున్నారు. ఇక పులివెందులలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి రెండు వర్గాలుగా విడిపోయారు.

ప్రొద్దుటూరులో...

ప్రొద్దుటూరులో ఎన్నికల ముందు వరకు సమష్టిగా పనిచేశారు. అధికారంలోకి వచ్చాక వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన కొందరికి ఇక్కడ ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెబుతున్నారు. కొన్ని పదవుల్లో కూడా వారికే ప్రాధాన్యం ఇవ్వడంతో పాతోళ్లు జీర్ణించుకోలేకున్నారు. టీసీ నేత నందం సుబ్బయ్య హత్యను ఎలక్షన్‌లో వాడుకున్నారే తప్ప దానిపై మరలా సిట్ కానీ, కేసు విచారణకు కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. డాడీ హోం రాజారెడ్డి హత్య కేసు సిట్‌కు అప్పగించారు. కానీ నందం సుబ్బయ్య హత్య కేసును పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మాజీ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి సఖ్యత లేదు.

బద్వేలులో..

బద్వేలులో గందరగోళంగా మారింది. అక్కడ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, కొందరు టీడీపీ నేతలకు పొసగడం లేదు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డితో కొందరు డీలింగ్స్ పెట్టుకుని మేం వాసు అనుచరులమని చెప్పుకుంటున్నారు. ఇక జమ్మలమడుగులో బాబాయి బీజేపీ ఎమ్మెల్యే అయితే అబ్బాయి టీడీపీ ఇన్‌చార్జి. అక్కడా లోకల్‌గా కొన్ని సమస్యలున్నాయి. మైదుకూరులో కూడా వలస నేతలదే పెత్తనం అని చెబుతారు.

పదవులపై ఆశలు

కష్టపడ్డ కార్యకర్తలకే పదవులు ఇస్తామని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చెబుతూ వస్తున్నారు. ఎన్నికల్లో మేం కష్టపడ్డ ట్రాక్ రికార్డు చూస్తే మాకు పదవులు వస్తాయని అయితే ఎమ్మెల్యేలు ఇన్‌చార్జిలు సిఫారుసు చేస్తే తమకు పదవులు రావనే బెంగ హార్డ్‌కోర్ టీడీపీ కేడరులో ఉంది. వివిధ మార్గాల ద్వారా కచ్చితమైన సమాచారం తెలుసుకుని అర్హులకు పదవులు ఇవ్వాల్సి ఉంటుంది. లేదంటే కేడరు అసంతృప్తి పెరుగుతుంది.

వలస నేతల ఓవరాక్షన్

ఎన్నికల ముందు, తరువాత టీడీపీలోకి వచ్చిన వలస నేతల వల్ల పార్టీకి డ్యామేజీ జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వీరు బెట్టింగ్, భూకబ్జాలకు పాల్పడుతున్నారు. వీళ్లల్లో చాలా మంది వైసీపీ నుంచి వచ్చిన వారే. వీరిని కట్టడి చేయకపోతే పార్టీకి ఇబ్బందే అంటున్నారు.

ఏకతాటిపై నడించేవారేరీ..?

జగన్ సొంత జిల్లాలో టీడీపీ భారీ విజయం సాధించినా ఇదే ఊపులో పార్టీని ఏకతాటిపై నడిపించేవారు కరువయ్యారు. సూపర్‌సిక్స్ పథకాలు ఇతర వాటిపై వైసీపీ నేతలు విమర్శిస్తున్నా టీడీపీ నేతలు వాటికి ధీటుగా చెప్పలేకపోతున్నారు. వైసీపీ సోషల్ మీడియాలో ట్రోల్ పెరుగుతోంది. దానికి టీడీపీ కౌంటరు ఇవ్వలేక పోతోంది. పది నెలల్లోనే హార్డ్‌కోర్ టీడీపీ డీలా పడిపోయారు. ఈ వ్యవహారంపై నేడు జిల్లాకు రానున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రులు దృష్టి సారించాలని ఆ పార్టీ వీరాభిమానులు కోరుతున్నారు. కాగా.. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కడపలో మహానాడు వేదికకు సంబంధించి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రులు స్థల పరిశీలన చేస్తారు. అనంతరం మహానాడు ఏర్పాట్లపై కో-ఆర్డినేషన్ కమిటీ, జిల్లా నేతలతో సమావేశం నిర్వహిస్తారు.



కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీనటి కొణిదెల నిహారిక


ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ




కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు


టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు


రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

క్యూలైన్లో స్పృహ తప్పిన చిన్నారి



ఒంటిమిట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా ఒంటిమిట్ట కోదండరామస్వామి దర్శనానికి వచ్చిన చిన్నారులు ఊపిరి ఆడక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేకువజాము నుంచే భక్తులు క్యూలైన్లో బారులు తీరారు. దీంతోపాటు ఎండ తీవ్రత కూడా ఎక్కువ కావడంతో చిన్నారులు కొంతమంది ఇబ్బందులు పడ్డారు. ఒక చిన్నారి స్పృహ కోల్పోయి కిందపడిపోయింది. దీంతో సెక్యూరిటీ సిబ్బంది ఆ చిన్నారిని పక్కకు తీసుకువచ్చారు. కొంతసేపటికి ఆ చిన్నారి స్పృహలోకి వచ్చింది. అనంతరం ఆ చిన్నారికి దర్శనం కల్పించారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని ఇలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

రాములోరి సన్నిధిలో ఆకేపాటి, మేడా వర్గీయుల వాగ్వాదం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలోని రాములవారి కోవెలలో ఆకేపాటి, మేడా వర్గీయులు వాగ్వాదానికి దిగారు. కోదండరాముని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి, తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి వచ్చారు. పూజ ముగిసిన తర్వాత విజయశేఖర్‌రెడ్డికి ఆకేపాటి వర్గీయులు అడ్డురావడంతో వాగ్వాదం మొదలైంది. అంతవరకు రామనామస్మరణతో మార్మోగిన ఆలయంలో కొంతసేపు గందరగోళం ఏర్పడింది. దీంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఆలయంలో ఇలాంటివి జరగడం సరికాదని పలువురు భక్తులు హితవు పలికారు.

జాతీయ స్థాయిలో విజేతలు కావడం ప్రశంసనీయం : డీఈవో

నందలూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నందలూరు విద్యార్థులు జాతీయ స్థాయిలో విజేతలుగా నిలవడం ప్రశంసనీయమని డీఈవో సుబ్రమణ్యం తెలిపారు. ఫిబ్రవరిలో బెంగుళూరులో జరిగిన నేషనల్ స్టూడెంట్స్ ఇన్నోవేషన్ చాలెంజ్-2025 పోటీలలో గొబ్బిళ్ల అక్షర స్కూల్ విద్యార్థులు లక్ష్మీచైతన్య, షేక్ జైనాబ్ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా స్కూలు చైర్మన్ త్రినాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆదివారం డీఈవోను కలిశారు. ఎన్ఎస్ఐసీ ప్రత్యేకత, షీ రూమ్స్ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులను మెడల్స్‌తో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనాథ్, మెంటర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను ప్రశంసిస్తున్న డీఈవో సుబ్రమణ్యం

కిడ్నాప్, చోరీ కేసులో ఇరువురి అరెస్టు

● సెల్‌ఫోన్ స్వాధీనం

కడప క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులు మార్చి 15న హైదరాబాదు నుండి కారును బాడుగకు తీసుకువచ్చి ఆపై డ్రైవరుపై దాడి చేసి బంగారు దోచుకెళ్లిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. సీఐ ఓబులేసు తెలిపిన వివరాల మేరకు.. కడపకు చెందిన సాదక్‌వల్లి, తాజుద్దీన్ గతనెల 15న హైదరాబాదులో ఇన్నోవా కారును బాడుగకు మాట్లాడుకుని 16న తెల్లవారుజామున కడపకు వచ్చారు. ఇక్కడున్న మరో ముగ్గురిని పిలిపించి కారు డ్రైవరును నిర్బంధించి అతని వద్ద ఉన్న బంగారు గొలుసు, సెల్‌ఫోన్‌తో పాటు కారును చోరీ చేశారని తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన సాదక్‌వలి, తాజుద్దీన్‌లను దేవునికడప రోడ్డులో అరెస్టు చేసి వారి నుండి ఒక సెల్‌పోను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మార్ఫింగ్ ఫోటోలతో యువతికి బ్లాక్‌మెయిల్

● పోలీసుల అదుపులో డాక్టర్..?

కడప క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వైద్యుడు అంటే దేవుడితో సమానం. అలాంటి వైద్య వృత్తిలో ఉన్న ఓ వ్యక్తి కీచక బుద్ధితో వ్యవహరించాడు. కడపకు చెందిన ఓ యువతి ఫోటోలను డౌన్‌లోడ్ చేసుకుని మార్ఫింగ్ చేసి యువతి సెల్‌ఫోనుకు పంపించాడు. ఫోను చేసి శారీరకంగా కలవాలంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతుండడంతో ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు చిన్నచౌకు పోలీసులు కేసు నమోదు చేశారు. వేములకు చెందిన ఆ డాక్టరుకు పులివెందులలో ఆసుపత్రి ఉంది. కడప హోమియో ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. ఇతడిని శనివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సెల్‌ఫోనులో చిత్రీకరించిన ఫోటోలు, ఇతర వీడియోలను పోలీసులు పరిశీలిస్తున్నారు. మార్ఫింగ్ ఫోటోలను ఎవరికైనా పోస్టింగ్ చేశాడా లేక మెయిల్ పంపాడా అన్న విషయంపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నేడో రేపో డాక్టరు అరెస్టు చూపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గంజాయి 'పుష్ప'లు

ముందు కూలీగా పనికి వెళ్తాడు. తర్వాత అడవిలో ఎర్రచందనం చెట్లను నరికే మాఫియాకు డాన్‌గా ఎదుగుతాడు.. ఇది పుష్ప సినిమాలో హీరో కథ. ముందు కొనుగోలుదారుల్లా వెళ్తారు. తర్వాత సరఫరాదారులుగా మారతారు. ఆ తర్వాత సరఫరాదారులకు లీడర్లు అయిపోతారు.. ఇది రియల్ లైఫ్‌లో గంజాయి స్మగ్లర్ల కథలు. ఒడిసా సరిహద్దుల నుంచి జరుగుతున్న ఈ గంజాయి సరఫరాలో లక్షలాది రూపాయలు చేతులు మారుతుండగా, వివిధ కేసులను విశ్లేషించిన పోలీసులకు 'పుష్ప' కథలు కోకొల్లలుగా వినిపిస్తున్నాయి.


రెండు రోజుల కిందట విజయవాడ పోలీసులు అరెస్టు చేసిన చిత్తూరు జిల్లా గంజాయి స్మగ్లర్లు

● ముందు కూలీలు.. ఆ తర్వాత స్మగ్లింగ్ లీడర్లు
● గంజాయి సరఫరాలో అంతకంతకూ ఎదుగుతున్న స్మగ్లర్లు
● ఒడిసా నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సరఫరా
● స్మగ్లర్లుగా వ్యవహరిస్తున్న చిత్తూరు జిల్లా యువకులు
● రెండు రోజుల కిందట అరెస్టు
● విచారణలో వినిపిస్తున్న పుష్ప సినిమా పోలిన కథలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): షేక్ షాజిద్... అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం మినికి గ్రామం అతడి సొంతూరు. షేక్ ఫయాజ్... చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం కొత్తపేట సొంతూరు. ఈ ఇద్దరికీ మధ్యప్రదేశ్‌లోని నాసిక్‌కు చెందిన సంజయ్‌తో సంబంధాలు కలిశాయి. ఇందుకు గంజాయే కారణమైంది. షాజిద్, ఫయాజ్‌ను పటమట పోలీసులు రెండు రోజుల కిందట ఎనికేపాడులో అరెస్టు చేశారు. వారి నుంచి 80 కిలోల గంజాయి, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. షాజిద్‌పై జిల్లాలో గంజాయి కేసులు ఉన్నాయి. వేర్వేరు గ్యాంగ్‌ల కింద ఇతను కూలీగా పనిచేశాడు. అన్నమయ్య జిల్లా నుంచి బయల్దేరి ఉత్తరాంధ్ర వరకు వెళ్లేవాడు. అక్కడ సరుకును కొనుగోలు చేసి పోలీసులకు చిక్కకుండా గమ్యస్థానాలకు చేర్చేవాడు. ఇలా గంజాయిని మరికొంతమందితో కలిసి తీసుకెళ్తుండగా, 2017లో చిల్లకల్లు పోలీసులకు చిక్కాడు. షాజిద్‌తో పాటు మిగిలిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి నుంచి అప్పట్లో 520 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత కొద్దికాలంపాటు స్తబ్దుగా ఉన్న షాజిద్ మళ్లీ గంజాయి సరఫరాలోకి దిగాడు. సంజయ్.. నాసిక్‌లో గంజాయి వ్యాపారానికి కింగ్‌పిన్‌గా ఉండగా, రెండు, మూడుసార్లు గంజాయిని ఉత్తరాంధ్ర నుంచి నాసిక్‌కు షాజిదే పంపించాడు.

'సిల్క్' గంజాయి

షాజిద్ కుటుంబం అన్నమయ్య జిల్లాలో పట్టు పురుగులు సాగు చేస్తోంది. వారు చేనేతలకు సిల్క్‌ను కూడా సరఫరా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో రామసముద్రంలో ఉన్న స్నేహితుల ద్వారా నాసిక్‌లో కొంతమందితో పరిచయం పెంచుకున్న షాజిద్.. 2017 నుంచి ఆ బంధాలు కొనసాగిస్తున్నాడు. అప్పట్లో చిల్లకల్లు పోలీసులకు చిక్కిన షాజిద్.. ఆ తర్వాత వేర్వేరు వ్యక్తులతో గంజాయి సంబంధాలు కొనసాగించినప్పటికీ పోలీసులకు మాత్రం చిక్కలేదు. ముందుగా నాసిక్‌లో వివిధ గ్యాంగ్‌ల్లో కూలీగా ఒడిసా, ఉత్తరాంధ్ర సరిహద్దులకు వచ్చాడు. తర్వాత తానే స్మగ్లింగ్‌కు కింగ్‌గా మారాడు. కూలీగా వెళ్లిన దానికంటే ప్రధాన స్మగ్లర్‌గా ఉంటేనే డబ్బు బాగా గిట్టుబాటు అవుతోందని భావించాడు. మధ్యప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న కారును గంజాయి స్మగ్లింగ్ కోసం కొన్నాడు. ఎంపీ 06 బీఏ 0710 నెంబరు కలిగిన ఈ కారును చిత్తూరు జిల్లాకు తీసుకొచ్చాడు. అక్కడి నుంచే గంజాయి స్మగ్లింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. గంజాయి కావాలని నాసిక్ నుంచి ఎవరైనా ఫోన్ చేస్తే బేరం మాట్లాడుకుంటాడు. అక్కడి నుంచి వచ్చిన మరొకరిని కార్లో తీసుకుని సరుకు కోసం మన్యానికి తీసుకెళ్తాడు. ఆ విధంగా చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన ఫయాజ్‌ను తీసుకుని వస్తుండగా నగరంలోని ఎనికేపాడులో పటమట పోలీసులకు దొరికిపోయాడు. ఫయాజ్ స్వయంగా డ్రైవర్ కావడంతో కారును నడపడానికి అతడిని వెంటబెట్టుకుని వచ్చాడు. నర్సీపట్నంలో రూ.2.50 లక్షలకు 80 కిలోల గంజాయిని కొనుగోలు చేసి నాసిక్‌కు బయల్దేరాడు. పక్కా సమాచారం రావడంతో పటమట పోలీసులు ఈ తరలింపును తొలిలోనే అడ్డుకున్నారు.

వాహనం ఢీకొని జింక మృతి


మృతి చెందిన జింక

సీకేదిన్నె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆజాద్‌నగర్ సమీపంలో జింక మృతి చెందింది. కడప-రాయచోటి పులివెందుల బైపాస్‌లో రోడ్డు దాటుతున్న జింకను ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో చెర్లోపల్లె రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు సమాచారం అందించడంతో చింతకొమ్మదిన్నె పోలీసులు, ఫారెస్టు సిబ్బంది మృతి చెందిన జింకను పరిశీలించి, ప్రమాదానికి కారణాలు విచారిస్తున్నట్లు తెలిపారు.

వాటర్‌గండిలో బాలుడి గల్లంతు

కడపక్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని వాటర్‌గండిలో ఆదివారం ఓ బాలుడు గల్లంతయ్యాడు. ఆ వివరాల్లోకి వెళితే.. కడప నగరం నకాశ్‌కు చెందిన సయ్యద్ సమీర్ (17) ఈత కోసం వాటర్‌గండిలో దిగాడు. ఈ క్రమంలో ఈత ఆడుతూ నీళ్లలో కొట్టుకుపోయాడని బంధువులు చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం సామగ్రిని తరలించొద్దు

● ఏసీఏ నుంచి నిధులు మంజూరు చేసినా పూర్తి చేయని వైసీపీ
● ఇన్‌చార్జితో కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్లి పనులను పూర్తి చేస్తాం
● టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరి వెంకట్రామిరెడ్డి


సామగ్రిని తరలింపును పరిశీలిస్తున్న వెంకట్రామిరెడ్డి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం నుంచి సామగ్రిని తరలించవద్దని టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్టేడియం వద్దకు వెళ్లి సామగ్రిని తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏసీఏ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. అయితే కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో పనులు పూర్తికాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం, ఏసీఏ సంఘం మారడంతో స్టేడియం నిర్మాణ పనులు మరుగునపడ్డాయి. దీంతో ఇక్కడ ఉన్న సామగ్రిని తరలిస్తున్న విషయం తెలిసిన వెంటనే వెంకట్రామిరెడ్డి వాహనాన్ని అడ్డుకున్నారు. సమస్యను టీడీపీ ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లి, అలాగే సంబంధిత అధికారులతో మాట్లాడి సామగ్రిని తరలించవద్దని కోరారు. అనంతరం మీడియాతో మాట్లా డుతూ గత ప్రభుత్వం కేవలం కమీషన్ కోసమే పనులు ప్రారంభించింది తప్ప పూర్తి చేయలేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పులివెందులలో స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టడం మంచిదే కానీ, 90 శాతం నిధులు మంజూరైనా పనులు మాత్రం 60శాతం అయ్యాయన్నారు. వీటిని తరలించవద్దని, క్రికెట్ స్టేడియం పూర్తి చేసి పులివెందులకు తలమానికంగా నిలబెడతామన్నారు. సమస్యను బీటెక్ రవితో కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం ● భారీగా తరలివచ్చిన భక్తులు

కడప కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా జిల్లాలోని పలు రామాలయాలు జైశ్రీరామ్ నినాదంతో హోరెత్తాయి. పలు ఆలయాల్లో కనులపండువగా సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కడపలోని బేల్దారి వీధి,చెమ్ముమియ్యాపేట, నాగరాజుపేట, ఆలంఖాన్‌పల్లె తదితర రామాలయాల్లో కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కాగా చెమ్ముమియ్యాపేట శ్రీరామాలయంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు హాజరై వేడుకల్లో పాల్గొన్నారు.

వల్లూరు..: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలోని సీతారామ లక్ష్మణ సమేత కోదండరామస్వామి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు కళ్యాణాలు నిర్వహించారు. అందులో భాగంగా మాచిరెడ్డిపల్లె, వల్లూరు, పైడికాల్వ, కొప్పోలులో కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. మాచిరెడ్డిపల్లె గ్రామంలో టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తానరసిరహారెడ్డి ఆయన సతీమణి సరళ ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం సీతారాముల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

పెండ్లిమర్రి..: మండల పరిధిలో ఆదివారం శీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కొన్ని గ్రామాలలో సీతారాముల కల్యాణం,ఊరేగింపులు నిర్వహించారు. చీమలపెంట గ్రామంలో బండలాగుడు పోటీలను ఏర్పాటుచేశారు.

కడప(వినాయకనగర్)..: రామాంజనేయపురం ప్రైవేటు ఎలక్ట్రికల్ కాలనీలో వెలిసిన సీతారామాంజనేయ లక్ష్మణ భరత శత్రుఘ్న సమేత కల్యాణ సీతారామ దేవస్థానంలో కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ధర్మకర్త కాశినబోయిన రాజు రామయ్య, కమిటీ సభ్యుడు కే. శ్రీనివాసులు కల్యాణాన్ని వైభవంగా నిర్వహిం చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చెన్నూరు..: శ్రీరామనవమి సందర్భంగా చెన్నూరు సీతారామనామ సంకీర్తన క్షేత్రంలో సీతారాముల కళ్యాణం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కనులపండువగా జరిగింది. మధ్యాహ్నం స్థానిక నేత లక్ష్మీదేవి, సాంబశివరావు దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. కాగా సీతారాముల ఉత్సవమూర్తులను చెన్నూరు పురవీధుల్లో సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు గ్రామోత్సవం చేశారు.

ఆనందోత్సాహాలతో ఆంజనేయస్వామి జెండాలు ఊరేగింపు..: చెన్నూరులో శ్రీరామనవమి సందర్భంగా ఆంజనే యుడి జెండాలు ఊరేగింపు ఆనందోత్సాహాల మధ్య జరిగింది. జెండాలను ఊరేగింపు తరువాత పెన్నాతీరంలోని పెన్నాంజనేయస్వామి ఆలయం వద్ద నిలిపారు. చెన్నూరు,కొండపేట, రామనపల్లె, ఓబులంపల్లె, కనుపర్తి ,బెస్తకాలనీ, లక్ష్మీనగర్, అరుంధతీనగర్, బుడ్డాయపల్లెలో స్వామివారి కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ చేశారు. కొండపేటలో బండలాగుడు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.



కడప బేల్దారి వీధిలో గల రామాలయంలో రాములవారి కల్యాణం

కమలాపురం రూరల్..: శ్రీరామనవమి సందర్భంగా నగర పంచాయతీ పరిధిలోని పెంచలయ్య స్కూలు వద్ద నిర్మించిన రామాలయం, ఎంపీడీవో కాలనీ,కొండాయపల్లె, చదిపి రాళ్ల గ్రామంలో వెలసిన సీతారామ లక్ష్మణ సమేత అంజనేయస్వామి ఆలయం, పలు గ్రామాల్లో శ్రీరామనవమి పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సీతారాముల గ్రామోత్సవాన్ని డప్పువాయిద్యాలతో బాణసంచా పేలుస్తూ వైభవంగా నిర్వహించారు.

సీకేదిన్నె..: మండలంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆలయాల్లో సీతారామ కల్యాణాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని స్వామినగర్, బుగ్గలేటిపల్లె, మూలవంక, తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు.

పులివెందుల రూరల్..: పులివెందుల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. సీతారాముల కళ్యాణంతో పాటు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామోత్సవాలు నిర్వహించారు.



బేల్దారి వీధిలోని రామాలయంలో రాములవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



పెండ్లిమర్రిలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



చెన్నూరులో సీతారాముల కల్యాణోత్సవం



కమలాపురంలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



చింతకొమ్మదిన్నె...స్వామినగర్‌లో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



పెండ్లిమర్రి...చీమలపెంట గ్రామంలో సీతారాముల కల్యాణం

గురిజాలలో బైక్ ర్యాలీ



సింహాద్రిపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): హిందూ సంఘాలను బలోపేతం చేయడానికి యువత నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆరెస్సెస్ సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు అభిప్రాయం వ్యక్తం చేశారు. మండలంలోని గురిజాల గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా వంద మందికి పైగా కాషాయ జెండాలు చేత పట్టి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ గురిజాల అప్పస్వామి ఆలయం నుంచి గురకుంట శైవక్షేత్రం వరకు నిర్వహించారు.గురిజాల, బి చెర్లోపల్లి, సింహాద్రి పురం తదితర గ్రామాల యువకులు, ఆరెస్సెస్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఇన్‌చార్జ్ మంత్రి సవిత రాక

పులివెందుల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంచార్జి మంత్రి సవిత మంగళవారం పులివెందులకు రానున్నారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో జరిగే విస్తృత సమావేశంలో ఆమె పాల్గొననున్నట్లు పులివెందుల టీడీపీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశం విజయవంతం అయ్యేందుకు తెలుగు తమ్ముళ్లు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

బీసీల సమరభేరీని విజయవంతం చేయండి

కడప మారుతీనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పూలే జయంతి సందర్భంగా బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఈ నెల 11న కడప కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నగిలి గురప్ప ఎస్సీ ఎస్టీ బీసీలకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బీఎస్పీ జిల్లా కార్యాలయంలో నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బాలచంద్ర, మహిళా అధ్యక్షురాలు బేబి, ఇతర నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కోళ్లలారీ

సీకేదిన్నె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వల చెరువు ఘాట్‌లో రెండో మలుపు వద్ద కోళ్ల లారీ అదుపు తప్పింది. రాయచోటి వైపు నుంచి మార్కాపురానికి కోళ్లు తీసుకెళుతున్న లారీ రెండో మలుపు వద్ద అదుపు తప్పి ఒకవైపునకు ఒరిగింది. అయితే ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదు. క్రేన్ సహాయంతో లారీ పైకి లేపి తీసుకెళ్లారు.

రోడ్డుపనులకు భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యేమాధవి, శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కడప నగ రం లక్ష్మీనగర్ టిడ్కో గృహ సముదాయంలో రోడ్డు నిర్మా ణానికి ప్రభుత్వ విప్, ఎమ్మె ల్యే మాధవీ, టీడీపీ జిల్లా అధ్య క్షుడు శ్రీనివాసరెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ 2014 నుంచి 2019 మధ్యలో ఉన్న టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను దాదాపుగా పూర్తి చేసిందన్నారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా 2432 లబ్ధిదారులకు పంపిణీ చేయలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో మిగలిన పనులు త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డయ్యయాదవ్, నవనీశ్వర్‌రెడ్డి, షరీఫ్, రమణారెడ్డి, వినోద్, శివశంకర్‌రాయుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నా తమ్ముడిని హింసించిన

పోలీసులపై చర్యలు తీసుకోండి

● బాధితుడి అన్న బర్కతుల్లా ఫిర్యాదు

కడప క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కమలాపురంలోని కోగటం వద్ద ఈ నెల 3వతేదీన ఇంటి విషయమై తమ తమ్ముడు బర్కతుల్లా ఫకృద్దీన్, బంధువుల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుందని, దీంతో తమ బంధువైన మాబుచాన్ పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేసినట్లు అన్న బర్కతుల్లా పేర్కొన్నారు. కాగా అదే రోజు రాత్రి కమలాపురం పోలీసులు తమ తమ్ముడిని అదుపులోకి తీసుకున్నారన్నారు. తరువాత గురువారం నుంచి శనివారం వరకు తమ తమ్ముడిని చూపించాలని పోలీసుస్టేషన్ వద్దకు వెళ్లినా పోలీసులు చూపించలేదని బర్కతుల్లా పేర్కొన్నారు. తరువాత లక్ష రూపాయలు డబ్బులు ఇస్తే మీ తమ్ముడుపై చిన్న కేసు నమోదు చేసి పంపిస్తామని ఇవ్వకపోతే కేసు నమోదు చేస్తానంటూ సీఐ రోషన్ బెదిరించారని బర్కతుల్లా ఆరోపించాడు. అయితే 5వ తేదీ మధ్యాహ్నం 12గంటలకు తమ్ముడితో మాట్లాడేందుకు స్టేషన్ లోపలికి వెళ్లగా ఒంటినిండా గాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. కాగా ఈ విషయాలను అన్నింటినీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత, మంత్రి నారా లోకేశ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బర్కతుల్లా పేర్కొన్నాడు. ఈ విషయంపై కమలాపురం సీఐ రోషన్‌ను వివరణ అడగ్గా తాను ఎవరినీ డబ్బులు డిమాండ్ చేయలేదని, వారి వ్యక్తిగత కారణాల వల్ల పోలీసులపై ఆరోపణలు చేస్తున్నారే తప్ప ఎలాంటి నిజం లేదని ఆయన తెలిపారు.

పులివెందులలో ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

పులివెందుల టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) :పులివెందులలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పూలంగళ్ల సర్కిల్ సమీపంలోని కృష్ణదేవరాయల విగ్రహం పక్కన ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఏపీ మార్కెట్ డైరెక్టరు వంగళ శశిభూషణ్‌రెడ్డి బీజేపీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సాంస్కృతికశాఖ కన్వీనరు భానుప్రకాశ్, అసెంబ్లీ కన్వీనరు తేరా మహేశ్వర్‌రెడ్డి, పులివెందుల మండల అధ్యక్షుడు నవీన్, బీజేపీ ఉపాధ్యక్షుడు పగడాల రాజశేఖర్, ఓబీసీ నాయకులు విష్ణు, నాగరాజుయాదవ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, లక్ష్మీనారాయణ, ద్వారక, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

శ్రీరామనవమిని ప్రశాంతంగా నిర్వహించండి : డీఎస్పీ



నంద్యాలంపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ

సింహాద్రిపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ సూచించారు. మండలంలోని నంద్యాలంపల్లి గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా కొన్నిచోట్ల వరకే శ్రీరాముని ఉత్సవ విగ్రహాన్ని పుర వీధులలో తిప్పాలని ఆంక్షలు పెట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగుతుం దని వచ్చిన సమాచారంతో డీఎస్పీ మురళీ నాయక్, సీఐ ఎస్వీ రమణ తమ సిబ్బందితో నంద్యాలపల్లిలో ఊరేగింపు వీధులను పరిశీలించారు.

నిరాశ్రయులకు అన్నదానం

కడప(వినాయకనగర్), ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రేమాల యం నిరాశ్రయ వసతి గృహంలో ఆదివారం హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోగు వెంకటేశ్‌భార్య ఎద్దుల మంజులవాణి వర్ధంతి సందర్భంగా వారి కుమారులు పవన్, సాయిమనోజ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు గుండ్లకొండ విజయలక్ష్మి, రవి, రెడ్డిలక్ష్మణ్, ఆశ్రమ నిర్వాహకుడు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో కనులపండువగా నవమి వేడుకలు

కడప కల్చరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి సందర్భంగా నగర రిమ్స్ సమీప శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నగరంలోని ఓ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ సినిమా, జానపద గీతాలకు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శిల్పారామం పరిపాలన అధికారి క్రిష్ణప్రసాద్, ఫీల్డ్ సూపర్‌వైజరు మధుసూదన్‌బాబు పర్యవేక్షణలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.



వైభవంగా నవమి వేడుకలు

● శోభాయమానంగా సీతారాముల కల్యాణోత్సవాలు ● ప్రత్యేక పూజలు, అన్నదానాలు ● భక్తులతో కిటకిటలాడిన రామాలయాలు


ప్రొద్దుటూరులో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న మహిళాభక్తులు




పోరుమామిళ్లలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దంపతులు

ప్రొద్దుటూరు టౌన్/రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలను ప్రజలు ఆదివారం వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నవమిని పురష్కరించుకుని పట్టణంలోని రామాలయా ల్లో సీతారాముల కల్యాణంను ఆలయ నిర్వాహకులు శోభాయమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేయడంతోపాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈవో రామచంద్రాచార్యులు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. మెయిన్‌బజారులోని ఆత్మారామస్వామి ఆలయంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం చేశారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. వసంతపేటలోని కోదండరామస్వామి ఆలయం, దేవాంగపేటలోని రామాలయం, తదితర రామాలయాల్లో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఖాదరబాదు, కానపల్లె, శంకరాపురం, ఉప్పరపల్లి గ్రామాల్లో సీతారాముల విగ్రహాలతోపాటు హనుమంతుని విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భకులకు వడపప్పు, పానకం, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగు పట్టణంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని తాడిపత్రి రోడ్డు, లక్ష్మీనగర్‌లో పట్టాభి సీతారాముల దేవస్థానంలో ఆలయ కమిటీవారు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని బురుజు ఆంజనేయస్వామి, గూడెం చెరువు, కన్నెలూరు, దేవగుడి, పి.సుగుమంచిపల్లి తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. ఎస్.ఉప్పలపాడు గ్రామంలో సీతారాముల కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు.

మైదుకూరు రూరల్‌లో :శ్రీరామనవమి వేడుకలు మైదుకూరులో ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని కోదండ రామాలయం, పార్వతీనగర్‌లో, యల్లంపల్లె శెట్టివారిపల్లె తదితర ప్రాంతాలలో ని రామాలయాల్లో ప్రత్యేక పూజలు అనంతరం సీతారాముల కల్యాణం కమనీయంగా జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

బద్వేలుటౌన్/రూరల్‌లో:మున్సిపాలిటీ, రూరల్ పరిధిలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయం, భావనారాయణనగర్‌లోని రామాలయం, కుమ్మరకొట్టాలలోని సీతారామచంద్రస్వామి ఆలయం, కోదండ రామస్వామి ఆలయం, గాండ్లవీధిలోని రామాలయం, అబ్బురాతివీధిలోని రామాలయంలో సీతారాముల కల్యాణం వేద మంత్రాల మధ్య అంగరంగవైభవంగా నిర్వహిం చారు. బోవిళ్లవారిపల్లె, చిన్న కేశంపల్లె తదితర ప్రాంతాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించి మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ గ్రామోత్సవాలు నిర్వహించారు.

పోరుమామిళ్లలో: పోరుమామిళ్లలో శ్రీరామనవమి సందర్భంగా చల్లగిరిగెల కోదండరామస్వామి ఆలయంలో సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. పోరుమామిళ్లలోని రెడ్డినగర్‌లోని కోదండరామస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దంపతులు హాజరై సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో రంగసముద్రం సర్పంచ్‌చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా చల్లగిరిగెల కోదండరామస్వామి ఆలయ ఆవరణలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రొద్దుటూరుకు చెందిన వృషభరాజములు మొదటి బహుమతి రూ.లక్ష రూపాయలు దక్కించుకోగా యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. కమలాపురంకు చెందిన తోట కుమారి వృషభరాజుములు రెండో బహుమతి రూ.50వేలు, మూడో బహుమతి రూ.30వేలు ప్రకాశం జిల్లా అగ్రహారంకు చెందిన నాగశివశంకర్, నాలుగో బహుమతి రూ.15వేలు బాపట్లకు చెందిన వీరాస్వామి చౌదరి, ఐదో బహుమతి రూ.10వేలు ఖాజీపేటకు చెందిన కె.బాలయ్య ఎద్దు దక్కించుకున్నాయి.

ఎర్రగుంటలో: శ్రీరామనవమి పురస్కరించుకుని ఆదివారం రామాలయాల వద్ద కల్యాణోత్సవాలతో సందడి నెలకొంది. ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. ఆదివారం ఉదయం క్రాంతినగర్, శ్రీరాములపేట, చిలమకూరు, పోట్లదుర్తిలో రామాలయాల్లో అత్యంత వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహించి ముత్యాల తలంబ్రాలు భక్తులకు పంపిణీ చేశారు. అన్నప్రసాదాన్ని పంపిణీచేశారు. రాత్రి నడివూరు, క్రాంతినగర్ రామాలయం నుంచి మహేశ్వర నగర్, రెడ్డినగర్ తదితర వీధుల్లో సీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా కోదండరాముని కల్యాణం

రాజుపాలెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా కోదండరామస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అందరికీ అన్న దానం ఏర్పాటు చేశారు. అదే విధంగా అర్కటవేముల గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించి అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వెంకటసుబ్బారెడ్డి, శేఖర్‌రెడ్డి, బాబురెడ్డి, నిశాంతి, సుభాష్‌రెడ్డి, నరసింహారెడి గ్రామ ప్రజలుపాల్గొన్నారు.

పెద్దముడియంలో: శ్రీరామనవమి వేడుకలను మండల పరిధిలోని అన్ని గ్రామాల పరిధిలో కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, రాములోరి కల్యాణం, గ్రామోత్సవాలు జరిగాయి. పెద్దపసుపుల గ్రామంలో రాములోరి కల్యాణం కన్నులపండువగా సాగింది.

ముద్దనూరులో:మండలంలో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. ఉదయం చింతకుంట రామాలయంలో సీతారాముల కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే సాయంత్రం మండలంలోని అన్ని రామాలయాల్లో సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించి, పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

మైలవరంలో: మండల పరిధిలోని చిన్నకొమెర్ల, నవాబుపేట, వేపరాల తదితర గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేపరాలలోని శ్రీరాముని దేవాలయంలో, దాల్మియా పరిశ్రమలోని కోదండ రామాలయంలో దాల్మియా హెడ్ ముఖేష్‌కుమార్‌సిన్హా ఆధ్వర్యంలో వేద పండితులచే సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని కల్యాణం తిలకించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నవమి వేడుకులకు ముస్తాబైన రామాలయాలు

కొండాపురంలో: మండలంలో ఆదివారం శ్రీరామినవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. మండలంలోని కొండాపురం పాత ఊరిలోని రామాలయంలోనూ, గండ్లూరు, ఓబన్నపేట, చౌటిపల్లె, తదితర చోట్ల శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు. గండ్లూరు రామాలయంతో పాటు పలుచోట్ల సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల అన్నదాన కార్యక్రమం, భజన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులతో రామాలయాలు కిటకిటలాడాయి.

చాపాడులో: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం శ్రీరామ నవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. వి.రాజుపాళెం గ్రామంలో లోమడ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. వెదురూరు, లక్ష్మీపేట, నక్కలదిన్నె, నాగులపల్లె, అన్నవరం, విశ్వనాథపురం, సోమాపురం తదితర గ్రామాల్లో ఉత్సవాలను నిర్వహించారు. రాజుపాళెం గ్రామంలో భక్తులకు అన్నదానం చేశారు.

దువ్వూరులో: దువ్వూరులో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములకు కల్యాణం నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు కొర్రపాటి వెంకటసుబ్బయ్య, పెంచికలపాటి రమణయ్య ఆధ్వర్యంలో జరిగిన నవమి వేడుకలను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అట్లూరులో: మండలంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కమలకూరులో సీతారాముల నూతన విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ప్రతి గ్రామంలో శ్రీరాముని ఆలయాల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పానకం, వడపప్పు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు..

బి.కోడూరులో: మండలంలోని 46 గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రామాలయం వద్ద పానకం, వడపప్పు భక్తులకు పంచిపెట్టారు. ఆదివారం రాత్రికి శ్రీరాముని మెరవణి నిర్వహించారు.

కాశినాయనలో:మండల వ్యాప్తంగా ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ప్రజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు.రామాలయాల్లో ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాలు, గ్రామోత్సవాలు నిర్వహించారు. బాలాయపల్లె,ఓబుళాపురం తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

ఖాజీపేటలో: మండల పరిధిలోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం శ్రీరామనవమిని పురష్కరించుకుని రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మధ్యాహ్నం సీతారాములకు వైభవంగా కల్యాణం నిర్వహించడంతోపాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రాత్రి మూలవారిపల్లె, సీతానగరం, నాగపట్నం, కొత్తపేట, భూమాయపల్లె, అగ్రహారం, పలు గ్రామాల్లో సీతారాముల ఊరేగింపు నిర్వహించారు.


జమ్మలమడుగులో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


రాజుపాళెం కోదండరామస్వామి ఆలయంలో వేడుకల్లో పాల్గొన్న దాతలు


బద్వేలులో రాములోరి గ్రామోత్సవం

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను అవిష్కరిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పట్టణ అధ్యక్షుడు వంకధార నరేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి నూతనంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జన సంఘ్ నుంచి 1980 ఏప్రిల్ 6వ తేదీన శ్యామ్ ప్రకాష్ ముఖర్జీ, దీన్ దయాల్ ఉపాధ్యాయ, అటల్ బిహారి వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ ఆధ్వర్యంలో బీజేపీ అవతరించిదన్నారు. నాడు ఇద్దరు ఎంపీలతో మొదలైన భారతీయ జనతా పార్టీ ప్రస్థానం ప్రస్తుతం వరుసగా మూడవసారి దేశంలో పార్టీ అధికారంలోకి రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా నాయకురాలు సీవీ జయలక్ష్మి, వీహెచ్‌పీ మల్లికార్జున రావు, ప్రధాన కార్యదర్శులు చెన్నా మోహన్, ముత్యాల శ్రీశ్రీ, ఉపాధ్యక్షులు వెంటేశ్వర రావు, రవి ప్రకాష్, ఆర్ రెడ్డి, ప్రసన్న కుమారి, శివశక్తి పుల్లారెడ్డి, సుంకు గురు ప్రసాద్, సినియర్ నాయకులు పరమేష్ రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

చాపాడులో: మండల కేంద్రమైన చాపాడులో ఆదివారం బీజేపీ నాయకులు ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద పార్టీ జెండాను వారు ఎగురవేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పేదల సంక్షేమం కోసం పీఎం కిసాన్, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి మాతృత్వ యోజన వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు, బీజేపీ నాయకులు పూజారి లక్షుమయ్య, సుబ్బరామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో: మండల పరిధిలోని వేపరాల గ్రామంలో భారతీయ జనతాపార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బీజేపీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు పాములేటి, కాటా చిన్న బాలయ్య, జయరాముడు, శ్రీనివాసులు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.
జెండాను ఆవిష్కరించిన బీజేపీ నాయకులు

ఖాజీపేటలో: భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకుని ఖాజీపేట బస్టాండు కూడలిలో బీజేపీ పట్టణాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6వ తేదీ పార్టీ ఆవిర్భావం జరిగిందని, పేదల కోసం పార్టీ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి తిప్పారెడ్డి, నాగార్జునరెడ్డి, కార్యదర్శి చెన్నక్రిష్ణ, కోశాధికారి వెంకటసుబ్బారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్‌లపై డ్రోన్ కెమెరాలతో నిఘా


డ్రోన్ కెమెరాల నిఘాతో యువకులను ప్రశ్నిస్తున్న పోలీసులు

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణ శివారు ప్రాంతంలో గంజాయి మత్తుపదార్థాల విక్రయించే సేవించే బ్యాచ్‌లపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని ప్యాక్షన్‌జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా ఎప్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు డీఎస్పీ భావన ఆధ్వర్యంలో గంజాయి బ్యాచ్‌పై ఆధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి వారిని పట్టుకునే చర్యలకు శ్రీకారం చుట్టామని సీఐ రమణారెడ్డి వెల్లడించారు. ఆదివారం పట్టణ శివారు పాంతాలైన ఎర్రగుంట్ల రోడ్డు , పాలకేంద్రం ఏరియా, ఏకోపార్కు , పెన్నానది పరివాహక ప్రాంతాలు పెన్నానగర్ ఇసుక దిన్నెలు , రైల్వేస్టేషన్ ఏరియా, పెద్ద శెట్టిపల్లె, రామేశ్వరం పెన్నానది పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచి అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను క్షుణ్ణంగా విచారిస్తున్నామన్నారు. గంజాయి బ్యాచ్‌లను పూర్తిగా ఏరివేసేందుకుచర్యలు తీసుకుంటున్నామన్నారు.

7తులాల బంగారు స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్


వ్యక్తిని అరెస్ట్‌చేసి బంగారాన్ని స్వాధీనం చేసుకున్న సీఐ రాజగోపాల్

బద్వేలుటౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్ర జ్యోతి) : గత వారం రోజుల క్రితం తెలుగుగంగ కాలనీ లోని ఓ ఇంటి లో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచ 7 తులాల బంగారు స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్‌సీఐ రాజగోపాల్ తెలిపారు. ఆదివారం పోలీసులకు రాబడిన సమాచారం మేరకు మైదుకూరు డీఎస్పీ పర్యవేక్షణలో అర్బన్ సీఐ రాజగోపాల్ ఆదేశాలతో ఎస్‌ఐలు సత్యనారాయణ, రవికుమార్‌లు సిబ్బందితో కలసి నెల్లూరురోడ్‌లోని పాల్‌టెక్నిక్ కళాశాల సమీపంలో చోరీకి పాల్పడిన నిందితుడు మురళీని అరెస్ట్‌చేసి సుమారు రూ.6లక్షల రూపాయలు విలువచేసే లాంగ్‌చైన్, ఒక జత బుట్టకమ్మలు, 2బంగారు బంగారు గాజులు, ఒక పాపిడిబిల్ల సుమారు 7 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. నిందితుడు నెల్లూరు జిల్లా కలువాయి గ్రామానికి చెందిన మురళీని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

చట్టాన్ని అతిక్రమిస్తే జైలుపాలు తప్పదు

● హత్యాయత్నం కేసులో ఆరుగురు అరెస్టు


పట్టుబడ్డ నిందితులతో సీఐ మోహన్

ఖాజీపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటివారైనా జైలుపాలు కాక తప్పదని సీఐ మోహన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ గత నెల 31వ తేదీ బంగ్లా సమీపంలోగల సౌభాగ్యపై దాడికి ప్రయత్నించారన్నారు. వారు కడప ఇర్కాన్ సర్కిల్‌లో ఉన్నట్లు సమాచారం రావడంతో ఆమేరకు దాడి చేసి సయ్యద్ మహమ్మద్‌గౌస్, గోవుల పసంత్, కొండల బబ్లూ, ఆకాశ్ కుమార్, చిన్నదినాని రమేష్‌లతోపాటు ఓ బాలుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారితోపాటు వారి వద్ద రెండు కత్తులు, మూడు మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏడుగురు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. వారికోసం గాలిస్తున్నామని తెలిపారు. పట్టుకున్న వారిని విచారించగా కడపకు చెందిన ఓబుళరెడ్డి, అతని తమ్ముడు సూర్య ఇరువురు సౌభాగ్యపై దాడి చేసి ఆమె వద్ద ఉన్న తాళాలను తీసుకురావాలని చెప్పడంతో ఆమేరకు దాడి చేశామని ఒప్పుకోవడం జరిగిందన్నారు. వారిని మైదుకూరు కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో హెడ్‌కానిస్టేబుల్ సుబ్రమణ్యం, సిబ్బంది కిరణ్, ఓబులేసు, అశోక్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటస్వామి కుటుంబాన్ని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పరామర్శించారు. ఆదివారం ఆయన గిరినగర్‌కాలనీకి చెందిన జల్లి వెంకటస్వామి రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలుసుకుని ఆదివారం వెంకటస్వామి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే మాజీ ప్రభుత్వ సలహాదారుడు నాగార్జునరెడ్డి, టీడీపీ నాయకులు మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ చెరకూరి చెన్నరాయుడు, కల్వకూరి వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షులు సీఎంబాషా తదితరులు వెంకటస్వామికి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కొండాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పాతకొండాపురానికి చెందిన కల్లూరు రంగాంజనేయరెడ్డి(45) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు రంగాంజనేయరెడ్డి లావనూరు గ్రామంలోని శనగల గోడౌన్‌లో శనివారం కూలీ పనికి వెళ్లి ప్రమాదవశాత్తు జారీ కింద పడి గాయపడ్డాడు. అతన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇతనికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆదమరిస్తే అంతేగతి



దువ్వూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని మూడు రోడ్ల కూడలి వద్ద ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. దీని చుట్టూ నిత్యం నీరు నిలువ ఉంటోంది. ఇక్కడ జనాలు ఎక్కువగా తిరుగుతుంటారు. పొరపాటున అటూ ఇటుగా వెళ్లేటప్పుడు ఆదమరిస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. విద్యుత్తు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె నిర్మించి నీరు నిలువ లేకుండా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దుస్థితిలో మురికివాడలు

● వ్యర్థాలతో నిండిపోయిప మురుగుకాలువలు
● చెత్త నిండా ప్లాస్టిక్ కవర్లు
● పారిశుధ్యం ప్రక్షాళన ఇదేనా !


సంజీవనగర్ మురికివాడ దుస్థితి

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణకు ఎన్ని నిధులు వెచ్చించినా... ఎంతమంది వర్కర్లను నియమించుకున్నా మురికి వాడల్లో పారిశుధ్యం మాత్రం మెరుగుపడటం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికి ప్రొద్దుటూరు పట్టణంలోని పలు మురికి వాడలల్లో పారిశుధ్య నిర్వహణ దుర్భరంగా మారి భయంకరమైన దుర్వాసనతో దోమలతో నిత్యం సహజీవనం గడపవసి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో రెగ్యులర్ ఔట్‌సోర్సింగ్ వర్కర్లు దాదాపు 400 వందలకు పైగా ఉన్నారు. ప్రతి నెలా వర్కర్ల జీతాలకు రూ.60 లక్షలు ఖర్చవుతున్నా చాలా వార్డుల్లో ముఖ్యంగా కాలువల్లో మురుగు తొలగింపు పనులు సక్రమంగా చేయడం లేదనే ఆరోపణలున్నాయి. మరోవైపు ప్రతి వీధి కాలువ పై ర్యాంపులు, తాపలు, బండలు వేసి మూసి వేయడం వలన తాము వాటిని తీసి ఎలా కాలువల్లో మురుగు తీయడం సాధ్యం కావడం లేదని కార్మికులు వాదిస్తున్నారు. దీంతో కాలువల్లో మురుగు పారక వ్యర్థాలతో మూసుకుని పోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో చెత్త దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ఇంటింటి చెత్తసేకరణ జరిగితే ఈ తరహా చెత్త దిబ్బలు ఎందుకువుంటాయని ప్రశ్నలు ఎదురవుతున్నాయి. చెత్త వాహనాలు బంద్ కావడంతో మున్సిపాలిటీ ఇంకా కొత్త వాహనాలు కొనుగోలు చేయలేదు. కానీ ఉన్న వాహనాలతో పాటు తోపుడు బండ్లతో ఇంటింటి చెత్త సేకరణ దాదాపు సాగుతున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి చెత్త దిబ్బలో అధిక శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. కాలువల్లో కూడా ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. ప్రధానంగా బ్రాందీ షాపులు బిర్యాని హోటళ్లు వున్న టూటౌన్ ప్రాంతంలో వాడిపడేసిన ప్లాస్టిక్ గ్లాసులను ప్లాస్టిక్‌కవర్లను రోడ్ల మీద కాలువ పక్కలో వేస్తున్న ఆ ప్రాంతంలో ఉన్న శానిటరీ సెక్రటరీలు ఏం చర్యలు తీసుకుంటున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజాఆరోగ్యశాఖ అధికారులుఎందుకు వాటిపై దాడి చేసి కేసులు నమోదు చేయడం లేదని ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు పట్టణంలో స్పష్టమైన ప్రణాళికతో పారిశుధ్య ప్రక్షాళన చర్యలకు నడుంబిగించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

నిరుపయోగంగా గ్రామసంత షెడ్లు

● బిల్లులు రాక అసంపూర్తిగా పనులు


కొండాపురంలో అసంపూర్తిగా నిలిచిపోయిన గ్రామసంత షెడ్లు

కొండాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రామసంతల ఏర్పాటుకు 2017-18 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతులు తాము పండించిన కురగాయలు ఇతరత్రా అమ్ముకోవడానికి వేదికగా వాటి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మండలంలోని కొండాపురం, లావనూరు గ్రామాలకు గ్రామసంతలు మంజూరయ్యాయి. సుమరు రూ.7 లక్షల వ్యయంతో వాటిని నిర్మించాల్సి ఉంది. దీంతో కొండాపురం సచివాలయం సమీపంలో గ్రామసంతకుకు గాను షెడ్లు నిర్మించారు. దీనికి అనుబంధంగా ఇంకా రూములను నిర్మించాల్సి ఉంది. లావనూరులో కూడా ఇదే పరిస్థితి. దీనికి సంబంధించి అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సగం మేర మాత్రమే బిల్లులు చెల్లించారు. అయితే ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని పూర్తిగా నిలుపుదల చేసింది. ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించలేదు. దీంతో గ్రామసంతలకు సంబంధించిన పనులు పూర్తిగా నిలిచిపోయాయి. బిల్లులు రాక పోవడంతో వాటి పనులను పూర్తిగా నిలుపుదల చేశారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటిపై దృష్టి సారించాల్సి ఉంది. వాటి నిర్మాణం పూర్తయితే రైతులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఈ విషయమై ఏపీవో వెంకటలక్షుమ్మను వివరణ కోరగా ఇందుకు సంబంధించిన వివరాలు ప్రస్తుతానికి రాలేదని తెలిపారు.